క్లుప్తంగా

వివాదాస్పద స్థలాన్ని పరిశీలించిన ఆర్డీఓ



పిడుగురాళ్ల: పట్టణ శివారులోని కొండమోడు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మేరీమాత విగ్రహం సమీపంలోని వివాదస్పదమైన స్థలాన్ని గురజాల ఆర్డీఓ మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదస్పద స్థలంలో ఉన్న రేకుల షెడ్లను ఇటీవల కూల్చటం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించి అనంతరం ఇందుకు బాధ్యులైన వారిపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించటం జరుగుతుందన్నారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మోర్జంపాడులో 'పొలం పిలుస్తోంది'



మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో వ్యవసాయ శాఖవారి ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ ఏఓ కె. రమమ్మా పాల్గొని మాట్లాడుతూ... కంది, మిరప పంటలను పరిశీలించటం జరిగిందని, వివిధ యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు సూచించారు. రైతుల సమస్యలను నివృత్తి చేశారు. మిరప పంటలో నీలిరంగు, పసుపు రంగు జిగురు అట్టలను మిరప తోటల్లో అమర్చుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు షేక్ జానిబాషా, జి.మణిదీప్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు



పాలువాయి జంక్షన్(రెంటచింతల): మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ వద్ద వేంచేసిన షిరిడీసాయి ఆలయంలో గురువారం భక్తులు ఆలయ అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ ఆలయానికి చేరుకుని సాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన బృందం బాబా గీతాలను ఆలపించగా భక్తులు తన్మయత్వం చెందారు. పాలువాయిగేటు గ్రామానికి చెందిన దారపునేని చెన్నయ్య, ఉమాదేవి దంపతులు భక్తులకు అన్నసంతర్పణం చేశారు. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజేతలకు బహుమతులు అందజేత



రెంటచింతల: ముగ్గుల పోటీలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని రామకృష్ణ సేవా మండలి అధ్యక్షుడు గుంటక కాశిరెడ్డి అన్నారు. సంక్రాంతి వేడుకలలో భాగంగా గురువారం రాత్రి స్థానిక ఉట్లస్థంభాల సెంటర్లో రామకృష్ణ సేవా మండలి, గ్రామ ప్రజల సహకారంతో నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలలోని విజేతలకు ఆయన నిర్వాహకులతో కలిసి బహుమతులను అందచేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను బోరుగడ్డ చైత్రిక, పల్ఫూరి లాస్య, ఎం.లోహిత గెలుపొందారు. ఈ పోటీలలో పాల్గొన్న 38 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. నిర్వాహకులు పల్ఫూరి రాముడు, పల్ఫూరి శివ, నాళం పెదబాబు, పల్ఫూరి సాయి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

చిలకలూరిపేట: హుదా సొసైటీ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో గురువారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని గుర్రాలచావిడి వీధిలోని హుదా సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరానికి 100 మంది పాల్గొని కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో అవసరమైనవారికి ఉచితంగా మందులు అందించి, 23 మందికి కళ్లజోళ్లు అందజేయనున్నారు. కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసిన 33 మందిని శుక్రవారం ప్రత్యేక వాహనాల్లో ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తీసుకువెళ్లి శస్త్రచికిత్సలు చేయించనున్నారు.

చరిత్ర ఘనం..అభివృద్ధి శూన్యం

- శిథిలావస్థలో శతాబ్దాలనాటి ఆలయం
- ఆలయ పరిరక్షణలో దేవదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం
- దుర్గి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం దుస్థితి
- పూర్వ వైభవం తీసుకురావాలని కోరుకుంటున్న భక్తులు



వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రధాన ద్వారం (ఇన్‌సెట్) గోడలు దెబ్బతిన్న ఆలయ గోపురం

దుర్గి: శతాబ్దాలు గడిచినా నేటికి చెక్కుచెదరని నిర్మాణం గత ఆలయాల సొంతం. ప్రస్తుతం కొనసాగుతున్న ఆలయపు ఆనవాళ్లను కాపాడుకొని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి పాలకుల పై ఉంది. వివరాలలోకి వెళితే క్రీ.శ. 1191లో నేడు దుర్గిగా పిలువబడుతున్న దుగ్యపట్టణంలో గోపీనాథ దేవరగా పిలువబడే శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం నిర్మించబడింది. కాకతీయ సామ్రాజ్ఞి అయిన రుద్రమదేవి ఓరుగల్లు రాజధానిగా పరిపాలించుకాలంలో నందపుర అగ్రహార ప్రభు ముఖ్యుడైన సవదరరి మల్లపరాజు కొడుకు కరణము నామమున పల్లనాంటిలోని దుగ్యపట్టణంలో శ్రీ గోపినాథ దేవరను ప్రతిష్ఠించారు. దుర్గి గ్రామంతో పాటు పరిసర గ్రామంలో ప్రతి కుటుంబంలో తమ ఇలవేల్పుగా వేణుగోపాల స్వామిని ఆరాధిస్తూ వేణుగోపాలు, గోపాలరావు పేర్లతో పాటు వేణుగోపాల స్వామి భక్తుడైన ధర్మవరం గ్రామానికి చెందిన చిరుమామిళ్ల సుబ్బయ్య అయ్యగారు పేరు వచ్చేలా పలువురు భక్తులు సుబ్బయ్య, సుబ్బారావు పేర్లను తన పిల్లలకు పెట్టుకుంటారు.

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి సున్నా..

దేవదాయ శాఖ పరిధిలోకి ఈ ఆలయం చేరినప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోవటం లేదని భక్తులు వాపోతున్నారు. పలు చోట్ల ఆలయ గోడలు పగుళ్ళు, పెచ్చులూడటం వంటివి జరుగుతున్నాయి. సుమారుగా 62 ఎకరాలకు పైగా భూమి ఆలయానికి చెందినది. ఈ భూమి నుంచి వచ్చే కౌలు ఆదాయం ప్రభుత్వానికి చెందుతుంది. అదే విధంగా ఆలయం పక్కన కళ్యాణ మండపం, కళ్యాణ మండపం పైన భక్తులకు భోజనశాలను దాతలు సహకారంతో నిర్మించారు. కానీ భోజనశాల శిథిలావస్థకు చేరి శ్లాబు సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నవి. ఈ కల్యాణమండపాన్ని ప్రతి సంవత్సరం వందలాది మంది భక్తులు వివిధ స్వామి మాలలు ధరించి భోజనాలకు ఉపయోగించుకుంటున్నారు. మరికొందరు భక్తులు కళ్యాణ మండపంలో వివాహాలు నిర్వహించుకుంటున్నారు. అరాకొరా వసతులుతో ఇవి ప్రస్తుతం కొనసాగుతున్నాయి. శ్రీ వేణుగోపాల స్వామి ఆలయానికి రంగులు వెలిసిపోయాయి. ఆలయ గోపురం, పలు విగ్రహాలను కాపాడుకుంటూ అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని భక్తులు, ప్రజలు కోరుకుంటున్నారు. గతంలో పెళ్లిళ్ల సీజన్‌లో ఈ ఆలయంలో వివాహాలు పెద్దఎత్తున జరిగేవి. ప్రస్తుతం సరైన వసతులు లేని కారణంగా క్రమంగా ఈ ఆలయంలో శుభకార్యాలు తగ్గుముఖం పట్టాయి.

అభివృద్ధికి ఐక్యంగా కలిసిరావాలి..

ప్రస్తుతం గ్రామస్తులు, భక్తులు కలిసికట్టుగా ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకొని పూర్వ వైభవం తీసుకురావటానికి ప్రయత్నం చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం తరపున కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్) నిధులు తీసుకురావటానికి గ్రామ పెద్దలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. డీపీఆర్‌ను సిద్ధం చేసుకొని ఉన్నతాధికారులను కలిసి శతాబ్ధాల చరిత్ర కలిగిన ఆలయాన్ని కాపాడుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



శ్లాబు పెచ్చులూడిపోయిన దేవాలయ ఆవరణలోని భోజనశాల

పూర్వవైభవం తీసుకురావాలి



శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయానికి శతాబ్దాల చరిత్ర కలిగి ఉంది. అటువంటి ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు, అధికారులు చర్యలు తీసుకొని పూర్వ వైభవం తీసుకురావాలి. గతంలో దుర్గి గోపాలస్వామి ఆలయమంటే చాలా మంది భక్తులకు పూర్తి విశ్వాసం ఉంది. అటువంటి పరిస్థితులు వచ్చేలా గ్రామస్తులంతా ఐకమత్యంగా ఆలయ అభివృద్ధికి సహకరించాలి.

– వెలిదండి శ్రీనివాసరావు, బీజేపీ మండల అధ్యక్షుడు

ఆలయ ప్రతిష్టను కాపాడాలి



శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం నేడు గత వైభవాన్ని కోల్పోయింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, దేవదాయ శాఖాధికారులు చొరవ తీసుకొని ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తక్షణమే నిధులు మంజూరు చేయాలి. శిథిలమైన ఆలయ గోడలతో పాటు, భోజనశాల, కళ్యాణ మండపాన్ని నూతనంగా నిర్మించాలి. ప్రతి ఏటా నిర్మించే తిరునాళ్లను ఘనంగా చేయాలి.

–కపలవాయి శ్రీనివాసరావు, దుర్గి గ్రామస్తుడు

19న ఉచిత మెగా వైద్యశిబిరం

గురజాల: కిమ్స్ శిఖర హస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని వైద్యుడు చిట్టెం లక్ష్మణ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, బీఎండీ(ఎముకల సాంద్రత పరీక్ష), ఊపిరితిత్తుల సామర్థ్యం, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంసీసీ లయన్ విజయం



పిడుగురాళ్ల: సంక్రాంతి సంబరాలలో భాగంగా మండలంలోని గుత్తికొండ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ 2025లో ఎంసీసీ లయన్ జట్టు విజయం సాధించింది. సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని గత 11 ఏళ్ల నుంచి గ్రామంలో క్రికెట్ పోటీలతోపాటు పలు ఆటల పోటీలను నిర్వహించటం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ విజేత ఎంసీసీ లయన్ జట్టుకు షీల్డ్‌తో పాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ డిపో గ్యారేజ్ నందు రోడ్డు భద్రతా మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా వినుకొండ ఆర్టీసీ డీఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మొదటి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టౌన్ ఎస్ఐ ఎస్‌కె. సమీర్‌బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ సమీర్‌బాషా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, నివారణ చర్యలు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్ఐను ఘనంగా సత్కరించారు.

వాహనచోదకులు నిబంధనలు పాటించాలి

ఎంవీఐ సీహెచ్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంవీఐ సీహెచ్ రాంబాబు

పిడుగురాళ్ల: వాహన చోదకులు డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, అలా మాట్లాడే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయని పిడుగురాళ్ల మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీఐ సీహెచ్ రాంబాబు హాజరై మాట్లాడుతూ... వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించి బస్సులను నడపవద్దని, బస్సులు ఓవర్ టేక్ చేసే సమయంలో జాగ్రత్తలు వహించాలని, ఓర్పు, సహనంతో డ్రైవింగ్ చేయాలని, సమయ పాలన పాటించాలని అవగాహన కల్పించారు. మూలమలుపుల వద్ద జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురయ్యేలా చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆర్టీసీ డిపో మేనేజర్ కోటేశ్వరనాయక్ మాట్లాడుతూ..రోడ్డు భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించాలన్నారు. సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, గ్యారేజ్ ఇన్‌ఛార్జి, యూనియన్ ప్రతినిధులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, మెకానిక్ సిబ్బంది, కండక్టర్లు హాజరయ్యారు.

మొక్కజొన్న పైరును ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన పొలాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు

కారెంపూడి: మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామంలో రైతు మాడ రామకృష్ణకు చెందిన 60 సెంట్ల విస్తీర్ణంలోని పొలంలో అర ఎకరం మేరకు మొక్కజొన్న పంటను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. కండె దశలో ఉన్న రెండెకరాల మొక్కజొన్న పంటను నేలమట్టం అయ్యేలా దుండగులు పాడు చేశారు. రైతు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు, ఎస్ఐ వాసు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆరుగాలం కష్టపడి పండించుకుంటున్న పంటను పాడు చేయడం చాలా పాపమని ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా వారిని కఠినంగా శిక్షించాలని జనసేన మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు పోలీస్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

జోరుగా కోడిపందేల నిర్వహణ



తలపడుతున్న కోళ్లు

యడ్లపాడు: సంక్రాంతి పండుగ సందర్భంగా నియోజకవర్గంలోనే యడ్లపాడు మండలం కేంద్ర బిందువుగా కోడి పందేలు జోరుగా సాగాయి. సంక్రాంతి, కనుమ రెండురోజులు పాటు బోయపాలెంలోని ఏపీ గురుకుల పాఠశాల సమీపంలో వీటిని నిర్వహించారు. భోగి పండుగ రోజునే కంచెల్ని ఏర్పాటు చేసుకున్నారు. అడిగిన అందరికీ అనుమతులు వచ్చాయనే పుకార్లు చేశారు. కూటమి ప్రధాన నాయకులు కనుసన్నల్లో ఉదయం 10 నుండి సాయంత్ర 6.00 వరకు నిర్విరామంగా కోడిపందేల నిర్వహణ కొనసాగింది. పందేల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేయడంతో స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి పందెంరాయుళ్ల ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. రెండు రోజులపాటు పందేలు నిర్వహించగా తొలిరోజు 30, రెండోరోజు 50 జతలు పోటీబరిలోకి దిగాయి. బరిలో దిగిన ప్రతి పుంజు యజమాని నుంచి రూ.1000 చొప్పున వసూలు చేశారు. పందెంలో గెలిచిన వారి నుంచి మరో రూ.1000 వసూలు చేశారు. నిర్వాహకులు బరుల వద్ద ఫొటోలు, వీడియోలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. విలేకర్ల మీద నిఘా పెట్టడానికి కొందరిని ఉంచారు. బరి వద్దకు వచ్చిన వారందరికీ ఫొటోలు, వీడియో తీసుకోకుండా పదేపదే హెచ్చరికలు చేశారు. పైపాకెట్‌లో కాని, చేతుల్లో ఫోన్లు ఉన్న వారిని నిర్మోహమాటంగా బరివద్ద నుండి పంపించేశారు. పందేల నిర్వహణ గురించి జిల్లాస్థాయిలో మార్మోగినా, తమకేమీ తెలియదన్నట్లు సదరు రెండు రోజుల మాత్రం పోలీసులు అటువైపు కన్నెత్తి చూడనే లేదు. కోడిపందేలు మొదలుకుని ఎలాంటి జూదాలకూ అనుమతుల్లేవని, ఎవరైనా ధిక్కరిస్తే అదుపులోకి తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేయడం తప్ప..క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుటుంబాన్ని ఆదుకోవాలి

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని అందుగుల కొత్తపాలెం వద్ద సోమవారం నాడు ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తితో పాటు 30 గొర్రెలు మృతి చెందిన సంఘటనలో కొడుకును, ఉపాధిని కోల్పోయిన కుటుంబాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతయ్య, సీపీఎం నాయకులు పరామర్శించారు. ప్రమాదంలో మృతిచెందిన కుర్రా తిరుపతయ్య తల్లిదండ్రులు గాలయ్య, రమణలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేతికి అందివచ్చిన కొడుకును ప్రమాదంలో కోల్పోయామని, జీవనాధారమైన 30 గొర్రెలు కూడా మృతి చెందాయని, మరికొన్ని గొర్రెలు గాయపడి ఆర్థికంగా చితికిపోయామని వాపోయారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం 30 లక్షలు నష్టపరిహారం అందించాలని నాయకులు డిమాండ్ చేశారు.

ఫ్లెక్సీ చించివేత ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు

ఎస్ఐ సుధీర్ కుమార్

దుర్గి: దుర్గి పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గి గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామ జనసేన నాయకుడు రుద్రాల రవి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా మాచర్ల, కారంపూడి రోడ్డు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు చించేశారని రుద్రాల రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించగా.. కాసినబోయిన బాల సైదులు, కొందరు దుర్గి గ్రామస్తులు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తిరునాళ్ల సందర్భంగా పాట కచేరీ విజయవంతం అయిన విషయం గురించి మాట్లాడుకుంటూ ఉండగా కాసినబోయిన బాల సైదులు పొరపాటున ఆ ఫ్లెక్సీ పై పడటంతో ఫ్లెక్సీ చిరిగిపోయింది తప్ప ఎవరూ ఉద్దేశ్యపూర్వకంగా చించలేదు అని ఎస్ఐ సుధీర్ కుమార్ గురువారం తెలిపారు.

అంతర పంటలతో అధిక రాబడి



ఈపూరు(శావల్యాపురం): అంతర్ పంటల ద్వారా రైతులకు అధిక రాబడి వస్తుందని జిల్లా ప్రకృతి అధికారులు వెల్లడించారు. గురువారం మండల కేంద్రమైన ఈపూరులో ప్రకృతి వ్యవసాయ రైతులు సాగు చేసిన మేడికొండ భాస్కరరావు, ఏడుకొండలు పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు సైదయ్య మాట్లాడుతూ భూమిలో వివిధ రకాల పంటలు సాగు చేయటం ద్వారా భూమి సారవంతం అవుతుందన్నారు. రైతులకు నిరంతరం ఆదాయం లభిస్తుందన్నారు. రైతులందరూ అంతర్ పంటల విధానం ఆచరించటం ద్వారా నష్టాలనుంచి అధిగమించవచ్చునన్నారు. అంతేకాక ప్రకృతి వ్యవసాయ విధానంలో వినియోగించే ఎరువులు బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, రైతులు సొంతంగా తయారు చేసుకోవటం వలన పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయటం ద్వారా రసం పీల్చే పురుగులు, మచ్చల పురుగులు, తెగుళ్ల ఉధృతి పూర్తిస్థాయిలో నియంత్రణ చేయవచ్చునన్నారు. దీంతో భూమిలో అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా ఉంటాయన్నారు. అంతర్ పంటల్లో భాగంగా గోరుచిక్కుడు బెండ, సజ్జ, అలసంద, కీరదోస, మినుము, కంది, దోస, జొన్న తదితర అంతర్ పంటల ద్వారా రైతులకు మేలు జరుగుతుందన్నారు.

21న ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలు

వినుకొండ(నూజెండ్ల): అఖిల భారత యువజన సమాఖ్య (ఏ.ఐ.వై.ఎఫ్) రాష్ట్ర 22వ మహాసభలు శ్రీకాకుళం జిల్లాలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో పల్నాడు జిల్లా ఏఐవైఎఫ్ ప్రథమ మహాసభలు ఈ నెల 21వ తేదీన వినుకొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కన్వీనర్ షేక్ సుభాని తెలిపారు. స్థానిక శివయ్య భవన్‌లో రాష్ట్ర మహాసభల గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ 21న పట్టణంలో ర్యాలీ నిర్వహించి శివయ్య స్తూపం సెంటర్లో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ మహాసభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని, రాష్ట్రంలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఈ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ భవిష్యత్ పోరాటాలు రూపొందించుకొని ముందుకు సాగడం జరుగుతుందని తెలిపారు. ఏఐవైఎఫ్ నాయకులు షేక్. గౌస్, ఖాసిం, మరియబాబు, మనోహర్, అభిషేక్, యనూష, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లపై ఇంటింటి పరిశీలన



చినపర్లపాయితండాలో పెన్షన్ లబ్ధిదారుడిని వివరాలడిగి తెలుసుకుంటున్న వైద్యుల బృందం

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పెన్షన్‌దారుల పరిశీలనను చేపట్టింది. మండలంలో 24 మంది రూ. 15వేలు పొందుతున్న వారి ఇళ్ల వద్దకు డాక్టర్ల బృందం వెళ్లి వారి వివరాలను, ధ్రువపత్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 24 మంది పెన్షన్‌దారులు ఉండగా, ఒకరు మృతి చెందినట్లు పేర్కొన్నారు. 23 మంది ఇళ్లకు వెళ్ళి పరిశీలించటం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి అన్నీ రకాల ధ్రువపత్రాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఉప్పలపాడు సచివాలయ పంచాయతీ కార్యదర్శి అందుగుల చంద్రయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ జవిశెట్టి నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ లబ్ధిదారుల వివరాలు సేకరణ..

గురజాల: సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పింఛన్ లబ్ధిదారుల పరిశీలన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండలంలో పూర్తిగా మంచంపై ఉండి పింఛన్లు తీసుకుంటున్న వారి వివరాలను సేకరించారు. మండలంలో మొత్తం 17 మంది ఆ విధంగా పింఛన్లు తీసుకుంటునట్లుగా గుర్తించారు. ఇంటింటికి వెళ్లిన బృంద సభ్యులు పింఛన్‌దారులను పరిశీలించారు. కేవీ సత్యనారాయణ, కె.నాగార్జున, కమిషనర్ శివన్నారాయణ తదితరులున్నారు.

బస్టాండ్ సెంటర్‌లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఎస్. శ్రీనివాసరావు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని బస్టాండ్ సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రోజు మండలంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వస్తుంటారన్నారు. ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ లేకపోవడం వలన ప్రయాణికులతో పాటు వ్యక్తిగత పనులపై రెంటచింతలకు వచ్చే వివిధ గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక రెవెన్యూ, గ్రామ పంచాయతీ అధికారులు స్థలం కేటాయించి సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక నజీరుద్దీన్‌షా చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేయాలని, పంట పొలాలకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయాలని, గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని, రైలుపేట కాలనీలో హిందూ శ్మశానవాటిక నిర్మించాలన్నారు. మాచర్ల నుంచి రెంటచింతల మీదుగా జిల్లా కేంద్రమైన నర్సరావుపేటకు ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నక్కా నాగిరెడ్డి

వినుకొండ (నూజెండ్ల): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వం లభిస్తుందని నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి అన్నారు. మండలంలోని మారెళ్లవారిపాలెం గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి మాట్లాడుతూ మారెళ్ళ వారి పాలెం ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో గత 13 సంవత్సరాల నుంచి క్రికెట్ పోటీలు క్రమం తప్పకుండా నిర్వహించటం అభినందనీయమన్నారు. అదే విధంగా ప్రతి ఏడాది క్రీడా స్ఫూర్తితో ఈ పోటీలు జరపటం శుభపరిణామన్నారు. అనంతరం మొదటి బహుమతి ఈదర గ్రామ క్రీడాకారులకు రూ.30 వేలు నగదు అందజేశారు. రెండవ బహుమతి గొల్లపాలెం టీం వారికి రూ.20 వేలు యక్కంటి నారాయణరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారెళ్ళ నాగిరెడ్డి, ఎంపీఎల్ కార్య నిర్వాహకులు మారెళ్ళ కృష్ణారెడ్డి, నూజెండ్ల సొసైటీ మాజీ అధ్యక్షులు పిచ్చిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.